క్లుప్తంగా

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



ఉత్సవంలో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: కుల మతాలకు అతీతంగా అందరూ ఐకమత్యంగా ఉండాలని మంత్రి సబితారెడ్డి అన్నారు. గురువారం సరూర్‌నగర్‌లో జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రామాలయం చైర్మన్ బోయిని మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బంగారు మైసమ్మ ఆలయ ట్రస్టీలు బేర బాలకిషన్, అరవింద్ కుమార్, మాజీ కార్పొరేటర్ అనితా దయాకర్‌రెడ్డి, మల్కాజిగిరి దయానంద్ కుమార్, సాతెల్లి నాగరాజు పాల్గొన్నారు.

వృత్తిదారులు వినియోగించుకోవాలి

బడంగ్‌పేట్: వెనుకబడిన వర్గాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తిదారులకు ఆర్థిక సహాయంగా రూ.లక్ష అందించనుందని, దీనిని వృత్తిదారులు వినియోగించుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు తిమ్మని గిరీష్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడారు. రాయితీ రుణం పొందేందుకు మహేశ్వరం నియోజకవర్గం వృత్తిదారులు ఆధార్, కులం, ఆదాయం, నివాస ధ్రువపత్రం, రేషన్‌కార్డు, ఒక ఫొటోతో మీ సేవలో ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



దీప్‌లాల్‌చౌహాన్

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ బంజారా సేవా సంఘ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా దీప్‌లాల్ చౌహాన్, వైస్ చైర్మన్‌లుగా పుర్యానాయక్, కోట్యానాయక్, ప్రధాన కార్యదర్శులుగా శంకర్‌నాయక్ బాలునాయక్, కోశాధికారిగా రాములు నాయక్, సలహాదారులుగా ఇంద్రావత్ రవినాయక్, దాస్యానాయక్, పాండునాయక్, దేవుజానాయక్, హమునాయక్, శ్రీనివాస్‌నాయక్, బోనానాయక్, భవాసింగ్‌నాయక్, సంతోష్‌కుమార్, దేవానంద్, చిన్నానాయక్, సంయుక్త కార్యదర్శిగా జగన్‌నాయక్, బన్సీలాల్‌నాయక్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ దీప్‌లాల్ మాట్లాడుతూ సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ ఆలయం, బంజారా భవన్‌కు స్థలం కేటాయించిన మంత్రి సబితారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

షెడ్లు కూల్చివేత

మహేశ్వరం: మన్సాన్‌పల్లి గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 136 ప్రభుత్వ భూమిలో మహేశ్వరం గ్రామానికి చెందిన కొందరు దళితులు నిర్మించుకున్న గదులు, షెడ్లను బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. ఇదే విషయమై గురువారం మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో దళితులు ఫిర్యాదు చేశారు. తాము కష్టపడి కట్టుకున్న గదులను కూల్చినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

10న లోక్ అదాలత్

తలకొండపల్లి: ఆమనగల్లు కోర్టు ఆధ్వర్యంలో ఈ నెల 10న నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ వెంకటేశ్ యాదవ్ చెప్పారు. పెండింగ్ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని అనుకుంటే లోక్ అదాలత్‌ను సంప్రదించాలని సూచించారు. యాక్సిడెంట్, భూ తగాదాలు, చీటింగ్, చిట్‌ఫండ్స్, వివాహ సంబంధిత కేసులు, చోరీ, అక్రమ మద్యం, ఇటుక, ఇసుక, మట్టి, కట్టెల రవాణా పేకాట, లాక్‌డౌన్, ట్రాఫిక్, కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించబడతాయని తెలిపారు.

నేడు తెలంగాణ సంక్షేమ సంబురాలు

ఇబ్రహీంపట్నం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎస్సీ,ఎస్టీ,బీసీ శాఖల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ సంక్షేమ సంబురాలను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రానున్నట్లు చెప్పారు.

ఇష్టపడి చదుకోవాలి



విద్యార్థి శ్రావణ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు

మంచాల: పాఠశాల స్థాయి నుంచే ఇష్టపడి చదువుకోవాలని ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం జీపీ కార్యాలయం వద్ద ఆరుట్ల మోడల్ స్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన శ్రావణ్‌కుమార్‌రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుంటే తప్పా పోటీ పరీక్షల్లో నెగ్గలేరని తెలిపారు. స్థానిక నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య పాల్గొన్నారు.

చెరువులకు పూర్వవైభవం

- మిషన్ కాకతీయతో జలకళ
- తీరిన సాగునీటి కష్టాలు
- అభ్యున్నతి చెందుతున్న మత్స్యకారులు
- బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి
- దశాబ్ది ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు



కందుకూరు: బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న జెడ్పీటీసీ తదితరులు



బోనమెత్తిన జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వసంత



మహేశ్వరం: అమీర్‌పేట్‌లో బోనంతో ఊరేగింపుగా వెళ్తున్న చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన మిషన్‌కాకతీయతో చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అమీర్‌పేట్‌లో చెరువుల పండుగను ఘనంగా జరిపారు. కార్యక్రమంలో భాగంగా చైర్‌పర్సన్.. పలువురు మహిళలతో కలిసి బతుకమ్మలతో ఊరేగింపుగా చెరువు వద్దకు వెళ్లారు. ఆటపాటల అనంతరం నిమజ్జనం చేశారు. కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ కాకతీయతో చెరువులు, కుంటల్లో పూడిక తీయించి, వాటికి పూర్వ వైభవం తెచ్చారని చెప్పారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులన్నీ జలకళతో కళకళలాడుతున్నాయన్నారు. తద్వారా మత్స్యకారులు, ముదిరాజులు చేపలు పెంచుకొని ఆర్థికంగా అభ్యున్నతి చెందుతున్నారని తెలిపారు. సాగు నీటికి కొరత లేకుండా పోయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, గ్రామ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్, ఉప సర్పంచ్ పోతుల నర్సింగ్, ఎంపీటీసీ పెంటల కుమారి రాయప్ప, ఎంపీడీఓ నర్సింహ, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బీఆర్‌ఎస్ నాయకులు, ఇరిగేషన్ అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో

కందుకూరు: తెలంగాణ అభివృద్ధి బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని గ్రామాల్లో చెరువుల పండుగను ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కందుకూరు, ముచ్చర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 9 ఏళ్ల కాలంలో దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి కార్యక్రమాలు ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణలో జరిగాయని చెప్పారు. మిషన్ కాకతీయతో చెరువులు, కాలువల్లో జలకళ సంతరించుకుందని, తద్వారా సాగునీటి కొరతతీరి, రైతులు సంతోషంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శమంత, రాంచంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, మల్లేశ్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జల్‌పల్లిలో..

పహాడీషరీఫ్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జల్‌పల్లి మున్సిపాలిటీలో చెరువుల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. కమిషనర్ ఎస్.వసంత, మహిళా సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేశారు. బతుకమ్మ, బోనాలతో డప్పు చప్పుళ్ల నడుమ చెరువు కట్టపై ఉన్న మైసమ్మ ఆలయానికి చేరుకున్నారు. బతుకమ్మ ఆటపాటల అనంతరం అమ్మవారికి బోనం సమర్పించి, బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ డీఈ వెంకన్న, ఏఈ ఆయేషా, సిబ్బంది బాలమణి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో..

మహేశ్వరం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలో చెరువుల పండుగలు ఘనంగా జరిగాయి. గ్రామస్తులు బోనాలు, బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్లి.. కొత్వాల్ చెరువు కట్టమైసమ్మకు బోనం సమర్పించారు. కార్యక్రమంలో మహేశ్వరం సర్పంచ్ ప్రియాంక, ఎంపీటీసీ సభ్యులు, కేసీ తండా సర్పంచ్ మోతిలాల్ నాయక్ పాల్గొన్నారు. మన్సాన్‌పల్లిలో సర్పంచ్ కంది అరుణ, ఉప సర్పంచ్ నర్సింహ యాదవ్, వార్డు సభ్యులు బతుకమ్మలు, బోనాలతో ఊరేగింపుగా చెరువు వద్దకు వెళ్లి అమ్మవారికి బోనం సమర్పించి, బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు. తుమ్మలూరులో సర్పంచ్ మద్ది సురేఖారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీహరి ముదిరాజ్, కల్వకోల్‌లో సర్పంచ్ గాదె థామస్‌రెడ్డి, ఉప సర్పంచ్ చంద్రయ్య యాదవ్, డబిల్‌గూడలో ఎంపీటీసీ స్వప్న, కోళ్లపడకల్, సుభాన్‌పూర్, నాగారం, నందుపల్లి, గొల్లూరు, మాణిక్యమ్మగూడ, ఆకన్‌పపల్లి, సిరిగిరిపురం, గంగారం గ్రామాల్లో పండుగను ఘనంగా నిర్వహించారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: మున్సిపాలిటీ రావిర్యాల పెద్ద చెరువు, తుక్కుగూడ సూరం చెరువు, మంఖాల్‌లో చెరువుల పండుగ ఘనంగా జరిగింది. బోనాలు, బతుకమ్మలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ మధుమోహన్, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



కాంగ్రెస్‌లో చేరుతున్న యువకులు

డీసీసీ అధ్యక్షుడు నర్సింహా రెడ్డి

పహాడీషరీఫ్: ముస్లిం మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ సందేశ్‌నగర్‌లో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో చల్లా ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని చెప్పారు. మున్సిపాలిటీలో ముస్లింలు నివాసం ఉండే ప్రాంతాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని, తాము అధికారంలోకి వస్తే వాటి రూపురేఖలను మార్చేస్తామని చెప్పారు. పీసీసీ కార్యదర్శి అమరేందర్ రెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, పార్టీ నాయకులు చిగురింత నర్సింహారెడ్డి, అహ్మద్ బామ్, మధుసూదన్ రెడ్డి, యూసుఫ్ ఖాద్రీ, ఫైజల్ ఖాద్రీ, సుల్తాన్ మీర్జా, ఉబేద్ షరీఫ్, జహంగీర్‌ఖాన్, అలీ జాబ్రీ పాల్గొన్నారు.

ఏం సాధించారని సంబురాలు

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: రాష్ట్రంలో ఏం సాధించారని బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు జరుపుతోందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. ధనిక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణను అప్పుల్లో ముంచారని విమర్శించారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడారు. కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదని, సకల జనులను మోసం చేసినందుకు పండుగ చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావొస్తున్న సందర్భంగా పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు శ్రీను, మల్లయ్య, భానుకిరణ్, మల్లేశ్‌గౌడ్, రాజేశ్, శివ పాల్గొన్నారు.

బాగున్న రోడ్లకే మరమ్మతులు!



వనస్థలిపురం డివిజన్ హస్తినాపురం ఈస్ట్ కాలనీలో కొత్త రోడ్డు నిర్మాణం కోసం పాత రోడ్డును తవ్వేస్తున్న కాంట్రాక్టర్లు



హస్తినాపురం డివిజన్ విశ్వేశ్వరాయ ఇంజినీర్స్ కాలనీలో అభివృద్ధికి నోచుకోని మట్టి రోడ్డు

- మట్టిరోడ్లను పట్టించుకోరు
- ఇదీ జీహెచ్‌ఎంసీ పనితీరు

వనస్థలిపురం: 'రాజుల సొమ్ము రాళ్ల పాలు' అన్న చందంగా జీహెచ్‌ఎంసీ నిధులు రోడ్ల అభివృద్ధి పేరిట దుర్వినియోగం అవుతున్నాయి.. అభివృద్ధికి నోచుకోని రోడ్ల సంగతి అటుంచితే.. బాగున్న రోడ్లకే మళ్లీ మళ్లీ మరమ్మతులు చేయడం, రోడ్డు మొత్తాన్ని తవ్వేసి తిరిగి కొత్త రోడ్లు వేయడం వంటివి చేస్తున్నారు. అభివృద్ధి పేరిట డివిజన్లలో చేపడుతున్న పనులు కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులకు లబ్ధి చేకూర్చడానికేనని కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు.

పలు కాలనీల్లో ఇంకా మట్టి రోడ్లే..

ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని శివారు డివిజన్లలో పలు కాలనీలు ఇంకా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. బీఎన్‌రెడ్డి నగర్, హస్తినాపురం, హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్లలో పలు కాలనీలు ఏర్పడి దాదాపు 20 సంవత్సరాలు కావస్తున్న కాలనీలలో ఇంకా మౌలిక వసతులు సమకూరలేదు. చాలా కాలనీల్లో మట్టి రోడ్డులే దర్శనమిస్తున్నాయి. తమ కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. అరకొర పనులు తప్ప పూర్తిస్థాయిలో కాలనీలు అభివృద్ధి చెందడం లేదని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు.

బాగున్న చోటే మళ్లీ అభివృద్ధి..

శివారు కాలనీలలో పరిస్థితి ఇలా ఉంటే ఇప్పటికే అభివృద్ధి చెందిన కాలనీల్లో పరిస్థితి మరోలా ఉంది. ఆయా కాలనీల్లో ప్రముఖ వ్యక్తులు నివాసం ఉంటుండటంతో ఎలాంటి సమస్య వచ్చినా త్వరితగతిన సమస్య పరిష్కారానికి అధికార యంత్రాంగం పూనుకుంటోంది. రోడ్లు కాసింత గుంతలమయంగా మారితే చాలు వెంటనే ఆ రోడ్డును పూర్తిగా తవ్వేసి కొత్త రోడ్లు నిర్మించడానికి సైతం అధికారులు వెనుకాడడం లేదు. మరమ్మతులు చేపడితే సరిపోయే చోట కూడా కొత్త రోడ్ల నిర్మాణాలు చేపడుతుండటంతో నిధులు దుర్వినియోగం అవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. అదే నిధులతో రోడ్లు లేనిచోట రోడ్లు నిర్మిస్తే బాగుంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

కాలనీలో పూర్తిస్థాయి రోడ్లు నిర్మించాలి

మా కాలనీ ఏర్పడి 15 సంవత్సరాలు అవుతోంది. ఇప్పటికీ కాలనీలో ఇంకా పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఏర్పడలేదు. ఇంకా పలుచోట్ల మట్టి రోడ్డులే ఉన్నాయి. ఎగుడు దిగుడు గుంతల రోడ్లతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలి.

– ఎ.గణేశ్, గాయత్రినగర్, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్

మైనింగ్స్‌తో దెబ్బతింటున్న పంటలు

- బీటలు వారుతున్న ఇళ్లు.. భూమిలో ఇరుక్కుపోతున్న బోర్లు
- మైన్స్ అండ్ రాక్స్ కంపెనీని మూసివేయాలి
- ప్రజాభిప్రాయ సేకరణలో బాధిత గ్రామాల ప్రజలు

కందుకూరు: మైనింగ్ కంపెనీల వలన పర్యావరణం దెబ్బతినడంతో పాటు ఇళ్లు బీటలు వారుతున్నాయని, వెంటనే వాటిని మూసివేయాలని బాధిత గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. గురువారం మీర్‌ఖాన్‌పేట సర్వే నంబర్ 112లో కొనసాగుతున్న మైన్స్ అండ్ రాక్స్ కంపెనీ అనుమతులు రెన్యూవల్ కోసం ఆర్డీఓ సూరజ్‌కుమార్ సమక్షంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. మీర్‌ఖాన్‌పేట, బేగరికంచె, వావిళ్లకుంటతండా, కుర్మిద్ద వాసులు వాటి అనుమతులు రద్దు చేయాలని కోరారు. ఆ సర్వే నంబర్‌లో ఉన్న ఇతర మైనింగ్ కంపెనీలను మూసివేయాలని డిమాండ్ చేశారు. మైనింగ్‌తో జరిగే బ్లాస్టింగ్‌లతో ఇళ్లు బీటలు వారుతున్నాయని, బోర్లు ఇరుక్కుపోతున్నాయని, దుమ్ము, ధూళితో పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మీర్‌ఖాన్‌పేట సర్పంచ్ జ్యోతిశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు కాకి రాములు, బేగరకంచె సర్పంచ్ సరళమ్మ, ఉప సర్పంచ్ పద్మ, కుర్మిద్ద సర్పంచ్ బందె రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణలో అనుమతులు ఇవ్వొద్దంటూ ఆర్డీఓకు విన్నవిస్తున్న ప్రజలు

అంధత్వ నివారణకు 'కంటివెలుగు'



బడంగ్‌పేట్: అద్దాలు పంపిణీ చేస్తున్న మేయర్ పారిజాత తదితరులు

బడంగ్‌పేట్: కంటి చూపు సమస్య ఉన్నవారు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేయర్ చిగురింత పారిజాత అన్నారు. గురువారం 19వ డివిజన్ లోకాయుక్త కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నేత్ర శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంధత్వ నివారణ కోసం ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కంటి జబ్బు ఉన్నవారు వినియోగించుకోవాలని సూచించారు. కంటి పరీక్ష అనంతరం వైద్యులు ఉచితంగా మందులు, కళ్లద్దాలు ఇస్తారని, అవసరమైతే శస్త్ర చికిత్స చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అమిత, నాయకులు శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, మోతిలాల్, మనోహర్, ధన్వంతర్‌రెడ్డి, భాను పాల్గొన్నారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ 36వ డివిజన్ ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో కంటి వెలుగు శిబిరాన్ని కార్పొరేటర్ ఎడ్ల మల్లేశ్ ముదిరాజ్ ప్రారంభించి మాట్లాడారు. నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న డివిజన్ ప్రజలు కంటివెలుగు కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఆయన కంటి అద్దాలు పంపిణీ చేశారు.

నేడు మంత్రి ముఖాముఖి

దిల్‌సుఖ్‌నగర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్‌కే పురం డివిజన్‌లోని కిన్నెర గ్రాండ్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులతో విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ముఖాముఖి ఏర్పాటు చేసినట్లు బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ అనుబంధ సంస్థల నాయకులు, వివిధ సంస్థల చైర్మన్లు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పూర్తికాని కళాశాల భవనం

ఇబ్రహీంపట్నం: ఏడేళ్లు గడిచినా ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తికాలేదని, వెంటనే పనులు ప్రారంభించి పూర్తిచేయాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు నందకిషోర్ మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం భవన నిర్మాణానికి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారని, కానీ నేటి వరకు అది పూర్తికాకపోవడం శోచనీయమన్నారు. వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేసి, భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు విప్లవ్ హరీశ్, అరుణ్, రాకేశ్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 27, వంకాయ 28, బెండ 45, పచ్చిమిర్చి 65, కాకర 38, బీర 45, క్యాలీఫ్లవర్ 28, క్యాబేజీ 13, కారెట్ 47, దొండ 28, ఆలు 20, ఉల్లి 16, గోకర 40, దోస 16, సొర 15, పొట్ల 18, అరటి 10, చిక్కుడు 75, అర్వి 40, మునగ 65, చిలగడదుంప 40, బీట్‌రూట్ 27, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 105, కాప్సికమ్ 55. ఈ ధరలు శుక్రవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. గురువారం నార్లకుంటతండాలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి సర్పంచ్ పూజతో కలిసి జెడ్పీటీసీ భూమిపూజ చేసి మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, గోవిందాయిపల్లి తండా సర్పంచ్ రామునాయక్, ఉప సర్పంచ్ రాములు నాయక్, వార్డు సభ్యులు నాయకులు, రాంచందర్, సరోజ, లీలా, హున్య, శక్రు, సరిత, రఘువీర్, కీర్యా, రాములు, హరికిషన్, పాండు, రమేశ్, హీరాసింగ్, భాస్కర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయ బృందం

నోడల్ అధికారి జంగయ్య

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, బడీడు పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని నోడల్ అధికారి జంగయ్య సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా నోడల్ అధికారి ఆధ్వర్యంలో సలార్‌పూర్, చల్లంపల్లి, వంపుగూడ, పెద్ద వేములోనిబావితండాల్లో గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. పాఠశాలల్లో వసతులు, విద్యా ప్రమాణాలు, క్రీడలు, సాధించిన ప్రగతిని చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. మీమీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విజయలక్ష్మి, శ్వేతా, ఎంపీటీసీ ప్రియ, ప్రధానోపాధ్యాయులు మల్లయ్య, ఖలీల్ అహ్మద్, లత, రాధిక, ఇందిరా, ఉపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, భాస్కర్‌రావు, నాయకులు శంకర్, భూనాథ్, రమేశ్ పాల్గొన్నారు.